## పనుల్లో వేగం పెంచండి

**సదాశివనగర్, న్యూస్‌టుడే:** రూ.195కోట్లతో మంజూరైన మిషన్ భగీరథ పైపులైన్ పనుల్లో వేగం పెంచాలని, డిసెంబర్ నాటికి నీటిని కామారెడ్డి మున్సిపాలిటీ, 215 ఆవాసాలకు సరఫరా చేయాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ మండలం దగ్గి శివారులో పనులు నిలిచిపోవడంతో కలెక్టర్ మంగళవారం పరిశీలించారు. కల్వర్టు పనులు అటవీ భూముల్లో చేయాల్సి ఉన్నందున అటవీ అధికారులు అనుమతి ఇవ్వాలని ఆదేశించారు. 44వ నంబరు జాతీయ రహదారి వెంట పైపులైను ఏర్పాటు చేసేందుకు జాతీయ రహదారి ప్రాజెక్టు డైరెక్టర్ అనుమతులు కావాలన్నారు. అనంతరం మల్లన్నగుట్ట సమీపంలోని మిషన్ భగీరథ నీటిశుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్ఈ రాజేంద్రకుమార్, ఆర్డీవో రంగనాథ్‌రావు, జడ్పీ సీఈవో చందర్, ఈఈలు నరేశ్, రమేశ్ తదితరులు ఉన్నారు.



దగ్గిశివారులో మిషన్ భగీరథ పైపులైను పనులు పరిశీలిస్తున్న కలెక్టర్

## డీసీసీబీ వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా

**నిజామాబాద్ వ్యవసాయం, న్యూస్‌టుడే:** నిజామాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు వైస్ ఛైర్మన్ ఎన్నిక వాయిదా పడింది. ఈ నెల 15న నిర్వహించేందుకు ఇదివరకే నోటిఫికేషన్ విడుదల చేశారు. నిజామాబాద్ ఎన్డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఛైర్మన్ కుంట రమేశ్‌రెడ్డితో పాటు 17 మంది డైరెక్టర్లు మంగళవారం హాజరయ్యారు. వైస్ ఛైర్మన్ ఎన్నికకు నామినేషన్లు రాకపోవడంతో వాయిదా వేస్తున్నట్లు ఎన్నికల అధికారి రామ్మోహన్ ప్రకటించారు. విషయం రాష్ట్ర సహకార అధికారి దృష్టికి తీసుకెళ్తామని, తర్వాత ఎప్పుడు నిర్వహించాలో తేదీ ప్రకటిస్తామని వెల్లడించారు. ఇదివరకు ఛైర్మన్‌గా ఉన్న భాస్కర్‌రెడ్డిని అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగించారు. వైస్ ఛైర్మన్‌గా ఉన్న కుంట రమేశ్‌రెడ్డి అధికార పార్టీ ఆశీస్సులతో ఛైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఇప్పుడు వైస్ ఛైర్మన్‌గా ఎవరుండాలో కాంగ్రెస్ పార్టీ పెద్దలు సమాలోచనలు చేస్తున్నారు. ఛైర్మన్ పదవి నిజామాబాద్ జిల్లాను వరించడంతో వైస్ ఛైర్మన్‌ను కామారెడ్డికి కేటాయించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

# లింగనిర్ధారణ ముఠాపై ఆరా

**వేర్వేరుగా వైద్యారోగ్య, పోలీసు శాఖల విచారణ**



ఈనాడు, కామారెడ్డి

జిల్లాలో గత కొన్నేళ్లుగా సాగుతున్న లింగనిర్ధారణ దందాపై వైద్యారోగ్య, పోలీసుశాఖలు ప్రత్యేకంగా బృందాలను ఏర్పాటు చేసి విచారణ చేపట్టాయి. రాజంపేటలో ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా లింగనిర్ధారణ చేస్తుండగా పోలీసులు నిందితుడిని అక్కడే పట్టుకున్న విషయం తెలిసిందే. ఈ దందాతో భాగస్వామ్యం ఉన్న ఐదుగురిని అరెస్టు చేయగా మరో తొమ్మిది మందిపై విచారణ చేపట్టారు. లింగనిర్ధారణ దందాను తీవ్రంగా పరిగణించిన కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఐదుగురు వైద్యాధికారులతో ప్రత్యేకంగా కమిటీని ఏర్పాటు చేసి సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఎస్పీ సింధుశర్మ సైతం దందాలో భాగస్వాములైన వారిని అరెస్టు చేయాలని పోలీసు యంత్రాంగానికి ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు.

### వెలుగులోకి విస్తుపోయే నిజాలు

వైద్య, పోలీసు శాఖల విచారణలో విస్తుగొలిపే విషయాలు బహిర్గతమవుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాకేంద్రంతో పాటు పరిసర మండలాల్లో లింగనిర్ధారణ చేయడంతో పాటు ఆడపిల్ల అని తేలితే గర్భస్రావం(అబార్షన్) చేయించే పనిలో సైతం అక్రమార్కులు భాగస్వాములైనట్లు తెలుస్తోంది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కామారెడ్డిలో మూడు ప్రైవేటు ఆసుపత్రుల్లో 35కి పైగా అబార్షన్లు చేసినట్లు విచారణలో తేలింది. గత మూడేళ్లుగా జిల్లాలో ఎన్ని జరిగాయనే దానిపై వైద్యశాఖ విచారణ బృందం ఆరా తీస్తోంది. లింగనిర్ధారణకు వైద్యారోగ్య శాఖలో ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించే సిబ్బంది భాగస్వామ్యం ఉందనే ఆరోపణల నేపథ్యంలో ఆ శాఖ యంత్రాంగం అప్రమత్తమైంది. ఎవరెవరు ఈ దందాలో ఉన్నారనే సమాచారాన్ని సేకరిస్తోంది. త్వరలో ఉన్నతాధికారులకు విచారణ నివేదికను సమర్పించేందుకు సమాయత్తమవుతున్నారు.

### యాత్రల్లో పాల్గొన్నవారు ఎవరు?

లింగనిర్ధారణ పరీక్షలకు సహకరించిన వైద్యసిబ్బందిని, ఆర్ఎంపీ, పీఎంపీలను అక్రమార్కులు షిర్డీ, గోవా యాత్రలకు తీసుకెళ్లినట్లు అధికారుల విచారణలో తేలింది. ఈ యాత్రల్లో పాల్గొన్న వారి గురించి వైద్యారోగ్య, పోలీసు శాఖలు ఆరా తీస్తున్నాయి. లింగనిర్ధారణ రాకెట్ మెదక్, సంగారెడ్డి, కరీంనగర్, సిరిసిల్ల జిల్లాలకు విస్తరించినట్లు విచారణలో తెలుస్తోంది. దుబ్బాకకు చెందిన గర్భిణికి లింగనిర్ధారణ చేస్తుండగానే రాజంపేటలో పోలీసులు పట్టుకున్నారు. లింగనిర్ధారణ దందాలో ఆర్ఎంపీ, పీఎంపీలతో పాటు ఒప్పంద ప్రాతిపదికన విధులు నిర్వహించే వైద్యారోగ్య సిబ్బంది పాత్ర ఉన్నట్లు విచారణ బృందాలు నిర్ధారణకు వచ్చాయి.

**ధనార్జనే ధ్యేయంగా తప్పుడు నివేదికలు**

లింగనిర్ధారణకు రూ.10 వేలు- రూ.15 వేలు వసూలు చేసిన అక్రమార్కులు అబార్షన్‌కు మాత్రం రూ.50 వేలు- రూ.75 వేలు వరకు వసూలు చేసినట్లు తెలుస్తోంది. తప్పుడు లింగనిర్ధారణ రిపోర్టులు ఇచ్చి గర్భిణులను మోసం చేసిన ఉదంతాలు సైతం బహిర్గతమవుతున్నాయి. ఇటీవల మహారాష్ట్రకు చెందిన గర్భిణికి జిల్లాకేంద్రం శివారులో లింగనిర్ధారణ పరీక్ష చేసి మగ బిడ్డ అయితే ఆడబిడ్డ అని తప్పుడు రిపోర్టు ఇచ్చారు. దీంతో ఆ మహిళ మహారాష్ట్ర పోలీసులకు ఫిర్యాదు చేసిన విషయం తెలిసిందే. ఆ రాష్ట్ర పోలీసులకు జిల్లాకు వచ్చి నిందితులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

# కొత్త సార్లు వస్తున్నారు

**నేటి నుంచి విధుల్లోకి ➺ విద్యాశాఖ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్**

**కామారెడ్డి విద్యావిభాగం, కలెక్టరేట్-న్యూస్‌టుడే:** పాఠశాలలకు కొత్త గురువులు వస్తున్నారు. అనుకున్నట్లే డీఎస్సీ అభ్యర్థుల నియామక ప్రక్రియ వేగవంతంగా పూర్తి చేశారు. జిల్లాలో 506 పోస్టులకుగాను 440 భర్తీ అయ్యాయి. ఈ నెల 9న హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో సీఎం చేతుల మీదుగా నియామకపత్రాలు అందుకున్నవారికి అధికారులు మంగళవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంపికైన బడుల్లో బుధవారం విధుల్లో చేరాలని అధికారులు సూచించారు.



అభ్యర్థికి విధుల కేటాయింపు పత్రం అందజేస్తున్న అదనపు పాలనాధికారి శ్రీనివాస్‌రెడ్డి, డీఈవో రాజు, విద్యాశాఖ అధికారులు తదితరులు

**భర్తీ అయిన పోస్టులు ఇవే**

| | ప్రభుత్వ | స్థానిక సంస్థలు |
|---|---|---|
| ● ఎస్ఏ - జీవశాస్త్రం | 1 | 15 |
| ● ఆంగ్లం | 1 | 12 |
| ● హిందీ | 1 | 6 |
| ● మరాఠీ | 1 | |
| ● ఫిజికల్ ఎడ్యుకేషన్ (తెలుగు) | 1 | 2 |
| ● సాంఘిక ఉర్దూ | 1 | |
| ● తెలుగు | 1 | 8 |
| ● ఉర్దూ | 1 | 1 |
| ● సాంఘిక (తెలుగు) | 2 | 36 |
| ● ఫిజికల్ సైన్స్ | | 8 |
| ● గణితం | | 16 |
| ★ ఎల్పీ మరాఠీ | | 1 |
| ★ తెలుగు | | 1 |
| ★ ఉర్దూ | | 1 |
| ★ హిందీ | | 3 |
| ★ తెలుగు | | 5 |
| ◆ ఎస్జీటీ - ఉర్దూ | 2 | |
| ◆ మరాఠీ | | 4 |
| ◆ తెలుగు | 11 | 256 |
| ◆ ఉర్దూ | | 12 |
| ◆ స్పెషల్ ఎడ్యుకేషన్ తెలుగు | | 25 |
| పీఈటీ తెలుగు | | 5 |

### మొదట గందరగోళం

స్థానిక కలెక్టరేట్‌లో ఉదయం స్కూల్‌అసిస్టెంట్లకు కౌన్సెలింగ్ నిర్వహించాల్సి ఉండగా రాష్ట్రశాఖ నుంచి ప్రక్రియ వాయిదా వేయాలని సమాచారం అందింది. అభ్యర్థులు సమావేశ మందిరానికి వచ్చి వెనుదిరిగారు. ఆ తర్వాత మధ్యాహ్నం 12 గంటలకు తిరిగి కౌన్సెలింగ్ నిర్వహించాలని నిర్ణయించడంతో 2 గంటల తర్వాత ప్రక్రియ ప్రారంభించారు. మొదట స్కూల్ అసిస్టెంట్ అభ్యర్థులను పిలిచి ఎక్కడ పోస్టింగ్ కేటాయించారో తెరపై చూపించారు. అనంతరం నిర్ధారణ పత్రాన్ని స్వీకరించారు.



మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో ఎల్ఈడీ తెరపై ఎక్కడెక్కడ ఖాళీలు ఉన్నాయో పరిశీలిస్తున్న ఎస్జీటీ అభ్యర్థులు

### ఎస్జీటీల నిరీక్షణ

ఆయా విభాగాల్లో, మాధ్యమాల వారీగా మొత్తం 310 ఎస్జీటీ పోస్టులకు కౌన్సెలింగ్ జరిగింది. అభ్యర్థులకు వచ్చిన ర్యాంకుల ఆధారంగా ప్రక్రియ కొనసాగింది. ప్రతిభ ఆధారంగా బడులను కేటాయించారు. మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు అభ్యర్థులు నిరీక్షించాల్సి వచ్చింది. జిల్లాలో డీఎస్సీ ద్వారా ఎంపికైన వారిలో పలువురు అభ్యర్థులు రెండేసీ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. వీరు ఒకే ఉద్యోగాన్ని ఎంపిక చేసుకోవడంతో 14 పోస్టులు ఖాళీగా మిగిలిపోనున్నాయి.

### కొన్ని పోస్టులకు అభ్యర్థులు కరవు

ఎస్జీటీ ఉర్దూ పోస్టులు ప్రభుత్వ 4, స్థానిక సంస్థలు 31 ఉన్నాయి. వీటిలో మొత్తం 35 పోస్టులు ఉండగా.. 14 మాత్రమే భర్తీ అయ్యాయి. మిగితా స్థానాలకు అభ్యర్థులు కరవయ్యారు. ఎస్జీటీ స్పెషల్ ఎడ్యుకేషన్ పోస్టులు 36కి 25 భర్తీ అయ్యాయి.

# కుదరని సమన్వయం

ఈనాడు, కామారెడ్డి

**ఇందిరమ్మ కమిటీలకు వెల్లువెత్తుతున్న సిఫార్సులు**

రాష్ట్ర ప్రభుత్వం నియోజకవర్గానికో 3500 గృహాల నిర్మాణాలు చేపట్టాలని నిర్ణయించింది. లబ్ధిదారుల ఎంపిక నిమిత్తం గ్రామపంచాయతీలు, పట్టణాల్లో వార్డుల వారీగా ఇందిరమ్మ కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఇన్‌ఛార్జి మంత్రి ఆమోదంతో కమిటీలలో సభ్యుల ఎంపిక జరుగుతుందని ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న జుక్కల్, ఎల్లారెడ్డిలలో సభ్యుల ఎంపిక ప్రక్రియ సాఫీగానే సాగుతోంది. బాన్సువాడ, కామారెడ్డిలలో మాత్రం కాంగ్రెస్ నేతల మధ్య సమన్వయం కుదరకపోవడంతో ఎవరికి వారే తమ అనుచరులతో కూడిన కమిటీల సభ్యులను ఎంపిక చేస్తూ ఎంపీడీవోలు, పురపాలక సంఘం కమిషనర్లకు సిఫారసు లేఖలు అందిస్తున్నారు. దీంతో ఏ లేఖలను ఇన్‌ఛార్జి మంత్రికి పంపాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

### బాన్సువాడలో వేర్వేరుగా ప్రతిపాదన లేఖలు

బాన్సువాడ నియోజకవర్గంలో స్థానిక ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అనుచరులతో పాటు మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి అనుచరులు వేర్వేరుగా కమిటీ సభ్యులను ప్రతిపాదిస్తూ అధికారులకు లేఖలు అందిస్తున్నారు. కామారెడ్డి నియోజకవర్గంలో సైతం కాంగ్రెస్ పార్టీ నేతల మధ్య సమన్వయం లేకపోవడంతో భిక్కనూరు, రామారెడ్డి, కామారెడ్డి గ్రామీణం, మాచారెడ్డి, బీబీపేట, దోమకొండ మండలాల్లో మండల, జిల్లా స్థాయి నేతలు వేర్వేరుగా తమ ప్రతిపాదనల లేఖలను అధికారులకు అందించారు. దోమకొండ, బీబీపేట మండలాల్లో కొన్ని గ్రామాల్లో మూడు వర్గాలకు చెందిన నేతలు వేర్వేరుగా అధికారులకు ప్రతిపాదనలు సమర్పించడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి వర్గీయులు బాన్సువాడ పట్టణానికి చెందిన కమిటీల సభ్యుల పేర్లతో కూడిన సిఫార్సులను ఏకంగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రికే అందించినట్లు చెబుతున్నారు.

### 150 గ్రామాల్లోనే తుది దశకు ప్రక్రియ

పాత, కొత్త వాటితో కలుపుకొని జిల్లావ్యాప్తంగా 535 గ్రామపంచాతీలున్నాయి. ఎల్లారెడ్డిలో 12, బాన్సువాడలో 19, కామారెడ్డిలో 49 వార్డులున్నాయి. వీటన్నింటిలో ఇందిరమ్మ కమిటీలను శనివారం సాయంత్రంలోగా ఏర్పాటు చేసి నివేదించాలని ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాలలో పేర్కొన్నారు. ఇప్పటి వరకు కేవలం 150 పంచాయతీలలో మాత్రమే కమిటీల ఏర్పాటు ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ప్రధానంగా నాయకుల మధ్య సమన్వయం కుదరకపోవడమే జాప్యానికి కారణంగా తెలుస్తోంది.



ర్యాలీ తీస్తున్న మైనార్టీ నాయకులు

## అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని శిక్షించాలి

**బాన్సువాడ, న్యూస్‌టుడే:** మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేశారని, అందుకు నిరసనగా బాన్సువాడలో మైనార్టీలు మంగళవారం స్వచ్ఛందంగా దుకాణాలు మూసేశారు. అనంతరం పట్టణంలో భారీ ర్యాలీ చేపట్టారు. సబ్‌కలెక్టర్ కార్యాలయ సిబ్బందికి వినతిపత్రం సమర్పించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జమా మసీద్ అధ్యక్షుడు ఇంతియాజ్ అహ్మద్, మసీద్ ఏ నూర్ అధ్యక్షుడు నయీం, షాదీఖానా ఛైర్మన్ వాహబ్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఎజాస్, గౌస్, తన్నూ, అఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

## 21 నుంచి ఎస్ఏ-1 పరీక్షలు

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు బడుల్లో ఈ నెల 21వ తేదీ నుంచి ఎస్ఏ-1 పరీక్షలు జరగనున్నాయి. 28వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. ఈ విద్యాసంవత్సరం వార్షిక కాలమానిని అనుగుణంగా ప్రక్రియ జరగనుందని విద్యాశాఖ అధికారులు వెల్లడించారు.

## సెలవుపై జీజీహెచ్ సూపరింటెండెంట్

**కామారెడ్డి వైద్యవిభాగం, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలోని జీజీహెచ్ సూపరింటెండెంట్ డా. రాంసింగ్ మంగళవారం నుంచి నెల రోజుల పాటు సెలవుపై వెళ్లారు. ఆయన స్థానంలో రక్తనిధి కేంద్రం, టీ హబ్ బాధ్యురాలు ఫరీదా బాధ్యతలు నిర్వర్తించనున్నారు. ఆసుపత్రిలో ఒత్తిడి తట్టుకోలేక సెలవుపై వెళ్లారని ప్రచారం జరుగుతోంది. సాధారణ కార్యకలాపాల నిర్వహణ గాడి తప్పిందని చెబుతున్నారు. ఈ విషయమై సూపరింటెండెంట్‌ను న్యూస్‌టుడే వివరణ కోరగా అయ్యప్ప మాల ధారణ కోసం సెలవు పెట్టినట్లు తెలిపారు.

## కత్తుల దాడి ఘటనలో నలుగురిపై కేసు

**సదాశివనగర్, న్యూస్‌టుడే:** సదాశివనగర్ మండలం లింగంపల్లిలో కత్తులతో దాడిచేసిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు. ఈ ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన తండ్రి ఇద్దరు కొడుకులకు గాయాలైన సంగతి తెలిసిందే. గుండెల్లి సాయిలుకు మోహన్, అనిల్ ఇద్దరు కుమారులున్నారు. వీరికి డబ్బుల విషయంలో అదే గ్రామానికి చెందిన గుండెల్లి సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్‌తో కొంత కాలంగా వివాదం జరుగుతోంది. నిందితులు సోమవారం రాత్రి సాయిలు, మోహన్, అనిల్‌పై కత్తులతో దాడి చేయగా తీవ్ర గాయాలయ్యాయి. వీరిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. వీరిలో సాయిలు, మోహన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దాడికి పాల్పడిన సంతోష్, ప్రదీప్, శ్రీకాంత్, వీరికి సహకరించిన ఆకాశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

## పరిసరాల పరిశుభ్రత ముఖ్యం



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

**పెద్దకొడప్‌గల్, పిట్లం న్యూస్‌టుడే:** పరిసరాల పరిశుభ్రత పాటించాలని సబ్ కలెక్టర్ కిరణ్మయి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు. అనంతరం వడ్లం, కాస్లాబాద్ జడ్పీ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. బడిలో మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు సబ్ కలెక్టర్‌కు విన్నవించగా త్వరితగతిన వాటిని నిర్మించేలా అధికారులకు ఆదేశాలిస్తానని చెప్పారు. తహసీల్దార్ దశరథ్, ఇన్‌ఛార్జి ఎంపీడీవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రత్యేకాధికారి కిషన్ ఉన్నారు. అనంతరం పిట్లం మండల కేంద్రంలో కొనసాగుతున్న ఎల్ఆర్ఎస్ సర్వే తీరును ఆమె పరిశీలించారు. సర్వే పక్కాగా చేపట్టాలని ఆదేశించారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఎంపీవో యాదగిరి తదితరులు పాల్గొన్నారు.



## ఉత్తమ ఇన్నోవేటర్ పురస్కారం

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** ఇంటర్నేషనల్ వైట్ కేన్ డే సందర్భంగా కామారెడ్డికి చెందిన సామాజిక కార్యకర్త చింతల పోచవ్వకు ఉత్తమ ఇన్నోవేటర్ పురస్కారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ హైదరాబాద్‌లో మంగళవారం ప్రదానం చేశారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా గో ఆధారిత ఉత్పత్తులు తయారు చేస్తున్నందుకుగాను ఈ పురస్కారం దక్కింది.

గవర్నర్ చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న పోచవ్వ



పల్వంచ మండలకేంద్రంలో ఓ ఇంటిలో రహస్యంగా దాచిన 11 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఈ నెల 14వ తేదీన పట్టుకున్నారు. ఈ బియ్యాన్ని వాడి గ్రామం నుంచి సేకరించి పల్వంచ మండలకేంద్రంలో దాచినట్లుగా తెలుస్తోంది.

కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి, సరంపల్లి గ్రామాల్లో వినియోగదారుల నుంచి కిలోల చొప్పున రేషన్ కొనుగోలు చేసి క్వింటాళ్లుగా విక్రయించే వ్యాపారులు ఉన్నారు.

**అధికారుల కళ్లుగప్పి అక్రమ రవాణా**

# రేషన్ బియ్యం దందా నిత్యకృత్యం

న్యూస్‌టుడే, కామారెడ్డి కలెక్టరేట్

కామారెడ్డి జిల్లావ్యాప్తంగా రేషన్ బియ్యం దందా కొనసాగుతోంది. వినియోగదారుల నుంచి కొనుగోలు చేసి పక్కదారి పట్టిస్తున్నారు. రహస్య ప్రాంతాల్లో బియ్యం నిల్వ చేసుకుంటున్నారు. కిలోల చొప్పున సేకరించి క్వింటాళ్లుగా పోగుచేస్తున్నారు. మంచి ధర వచ్చిన తర్వాత విక్రయిస్తున్నారు. అధికారులు నిఘా పెంచినా వారి కళ్లుగప్పి బియ్యాన్ని రవాణా చేస్తున్నారు. కొన్ని చోట్ల పోలీసులు దాడులు చేసి పట్టుకుంటున్నారు. అయితే కామారెడ్డి నియోజకవర్గంలో అక్రమ రేషన్ బియ్యం దందా ఎక్కువగా కొనసాగుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

### మిల్లులకు వెళ్తున్నాయా..?

కొందరు మిల్లర్లు అక్రమ రేషన్ బియ్యం దందాను ప్రోత్సహిస్తున్నట్లు తెలుస్తోంది. కిలోల చొప్పున సేకరించిన బియ్యాన్ని క్వింటాళ్లుగా పోగు చేసి వ్యాపారం చేస్తున్నారు. ముఖ్యంగా నెలలో మొదటి 15 రోజుల పాటు బియ్యం సేకరిస్తున్నారు. తర్వాత 15 రోజుల్లో బియ్యాన్ని గమ్యస్థానానికి చేర్చుతున్నారు. జిల్లాలో ప్రతి నెలా 1 నుంచి 15వ తేదీ వరకు చౌకధరల దుకాణాల్లో బియ్యం పంపిణీ చేస్తుంటారు. ఇదే సమయంలో దళారులు గ్రామాల్లోకి వెళ్లి వినియోగదారుల వద్ద బియ్యం కొనుగోలు చేస్తున్నారు. కిలోకు రూ.12-16 వరకు వెచ్చిస్తున్నారు. ఇదే బియ్యాన్ని రూ.25-28 వరకు విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ విధంగా కొనుగోలు చేసిన బియ్యాన్ని కొందరు మిల్లర్లు కొనుగోలు చేసి సీఎంఆర్ పంపిస్తున్నారు. మరికొందరు జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు.

**పట్టుబడినా ఆగడం లేదు**

జిల్లాలో చాలా చోట్ల అక్రమ రేషన్‌బియ్యం పట్టుబడుతున్నా దందా ఆగడం లేదు. పోలీసులు, పౌరసరఫరాలశాఖ విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయిలో నిఘా పెంచి దాడులు చేసినా పరిస్థితిలో మార్పురావడం లేదు. కొనుగోలు చేసిన బియ్యాన్ని ఇతర మార్గాల్లో గమ్యస్థానానికి చేర్చడానికి ప్రయత్నిస్తున్నారు. కొందరు పట్టణాల్లో ఇళ్లు అద్దెకు తీసుకుని అందులో బియ్యాన్ని డంప్ చేస్తున్నారు. ఈ విషయమై ఏఎస్‌వో నర్సింహారావు న్యూస్‌టుడేతో మాట్లాడుతూ.. రేషన్ బియ్యం విక్రయించే వినియోగదారుల కార్డులు రద్దు చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం కిలోకు రూ.39.50 చెల్లించి బియ్యం సరఫరా చేసేది పేదల కోసమేనని తెలిపారు. రేషన్ బియ్యం దందా చేసేవారిపై కేసులు నమోదు చేస్తున్నామని పేర్కొన్నారు.

# పిల్లలకు పోషకాలు అందేలా...

న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం

**బడుల్లో రాగి జావ కార్యక్రమం పునఃప్రారంభం ☛ తాజాగా విద్యాశాఖ ఉత్తర్వులు**

ప్రభుత్వ బడుల్లో ఆగిపోయిన రాగి జావ పంపిణీ కార్యక్రమం తిరిగి అమలు కానుంది. గతేడాది కొనసాగిన ప్రక్రియ కొంతకాలం పాటు నిలిచింది. తాజాగా ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభించాలని విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. బలవర్ధకమైన ఆహారాన్ని పిల్లలకు అందించాలనే ఉద్దేశంతో రాగి జావపై యంత్రాంగం దృష్టి పెట్టింది. అన్ని బడుల్లో త్వరలోనే పంపిణీ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు.

### అల్పాహారం తీసుకోకుండానే బడులకు..

కొంతమంది విద్యార్థులు ఉదయం ఎలాంటి అల్పాహారం తీసుకోకుండానే బడులకు వస్తూ మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఆకలితో ఉంటున్నారు. దీంతో వారు చదువుపై అంతగా దృష్టి పెట్టడం లేదని గ్రహించిన గత ప్రభుత్వం విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ సమస్య అధిగమించేందుకు కొన్ని బడుల్లో అల్పాహార పథకాన్ని అమలు చేసింది. ఈ క్రమంలో ప్రభుత్వం మారడంతో ఇప్పటివరకు ఆ కార్యక్రమం అమలుకు చర్యలు లేవు. తాజాగా పంపిణీ చేసేందుకు చర్యలు చేపడుతున్నారు.



| జిల్లా | బడులు | విద్యార్థులు (లక్షల్లో) |
|---|---|---|
| నిజామాబాద్ | 1234 | 1.50 |
| కామారెడ్డి | 1013 | 1.20 |

### నిరంతరాయంగా అందిస్తేనే..

మధ్యాహ్న భోజన వంట ఏజెన్సీల ద్వారా నిరంతరాయంగా పిల్లలకు ఉదయం పూట జావ అందిస్తే పోషకాలు సమకూరే వీలుంది. వేలాది మంది విద్యార్థులకు ఉపయోగపడుతుంది. ఈ విషయమై కామారెడ్డి డీఈవో రాజు స్పందిస్తూ.. విద్యార్థులకు త్వరలోనే రాగి జావ అందించాలనే ఆదేశాలు వచ్చాయన్నారు. కావాల్సిన సామగ్రి బడులకు చేరగానే కార్యక్రమం ప్రారంభిస్తామన్నారు.



జెండా ఆవిష్కరణలో పాల్గొన్న సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్

## ప్రభుత్వ హామీల అమలుకు పోరాటం

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేసేలా ఉద్యమించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్‌గౌడ్ పిలుపునిచ్చారు. మంగళవారం జంగంపల్లి గ్రామంలోని మల్లుస్వరాజ్యం కాలనీలో పార్టీ మండల ప్రథమ మహాసభ నిర్వహించారు. పార్టీ జెండా ఆవిష్కరించి అమరవీరులకు నివాళులు అర్పించారు. ఇందిరమ్మ ఇళ్లు, రైతుబంధు, ఆసరా పెన్షన్లు, మహాలక్ష్మి పథకం వంటి హామీలు అమలు చేసేలా ప్రభుత్వంపై పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొత్త నర్సింలు, పేరం నర్సవ్వ, బుడ్డ రామస్వామి, సిద్ధరాములు, చంద్రకళ పాల్గొన్నారు.

## కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు అవకాశం

**బిచ్కుంద, నూస్‌టుడే:** బిచ్కుంద ఐటీఐ కళాశాలలో ఈ ఏడాది ఆరు కొత్త కోర్సులు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ జి.ప్రమోద్‌కుమార్ తెలిపారు. ప్రవేశాల కోసం ఆన్‌లైన్‌లో నమోదు చేసుకుని సంబంధిత ధ్రువపత్రాలు సమర్పించాలని పేర్కొన్నారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

# సమర్థ వినియోగం.. ఉత్తమం

● ప్రపంచ ఆహార దినోత్సవం నేడు


● తలసరి ఆహార వృధా 55 కిలోలు

న్యూస్‌టుడే, ఇందూరు ఫీచర్స్



ఏ దేశ ప్రగతినైనా తలసరి ఆదాయం, వినియోగంతోనే లెక్కిస్తారు. ఇదే కోణంలో దేశంలో తలసరి ఆహార వినియోగమెంత? వృథా చేస్తున్నదెంత? అన్నది లెక్కిస్తే.. వినియోగం 207.6 కిలోలు అయితే వృథా 55 కిలోలు. ఇదే క్రమంలో ప్రతి తొమ్మిది మందిలో ఒకరికి సరైన ఆహారం దొరకడం లేదని అధ్యయనాలు చెబుతున్నాయి.

☛ పెరుగుతున్న జనాభా, తగ్గుతున్న ఉత్పాదకత, ఇతరత్రా కారణాలతో ఆహారోత్పత్తులకు డిమాండు పెరిగింది. దీంతో ధరలు అమాంతం పెరిగి పౌరులు సమతుల ఆహారం తీసుకోవడానికి ప్రతిబంధకంగా మారుతోంది. ఆహార సంక్షోభాలు మన వద్దకు రాకుండా జాగ్రత్త పడాలంటే.. ఉత్పత్తి అవుతున్న ఆహారాన్ని సమర్థంగా వినియోగించుకోవడమే సరైన పరిష్కారం. దీనిపై అవగాహన పెంచేందుకే ప్రపంచ ఆహార దినోత్సవాన్ని ఐక్యరాజ్య సమితి అనుబంధ ఆహార, వ్యవసాయ సంస్థ నిర్వహిస్తోంది. 'మెరుగైన జీవితం. మంచి భవిష్యత్తుకు ఆహార హక్కు' అని ఆ సంస్థ పిలుపునిచ్చింది. ఇతరుల ఆహార హక్కు కాపాడాలంటే వృథా అరికట్టాలని ప్రతిఒక్కరు గుర్తించాలి.




ప్రభుత్వ జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-5 వివరాలు (శాతాల్లో)

| విషయం | నిజామాబాద్ | కామారెడ్డి |
|---|---|---|
| (15-49 ఏళ్ల మహిళల్లో) | | |
| రక్తహీనత | 57 | 58.9 |
| బాడీమాస్ ఇండెక్స్ సాధారణం | 21 | 21.7 |
| ఐదేళ్లలోపు పిల్లల్లో బరువు తక్కువ | 38.4 | 43.9 |
| ,, ,, బరువు ఎక్కువ | 2.8 | 3.1 |

### ఉమ్మడి జిల్లాలో పరిస్థితి..

ఉమ్మడి జిల్లా జనాభా 26 లక్షలు. జాతీయ సగటు ప్రకారం ప్రతి పౌరుడు ఏడాదికి 55 కిలోల చొప్పున వృథా లెక్కేసినా దాదాపు 15.40 కోట్ల కిలోలు ఉంటుంది. ఏటా 20 వేలకు పైగానే వేడుకలు నిర్వహిస్తుంటారు. ఒక విందులో 30 శాతం ఆహారం వ్యర్థమవుతుందని అంచనా. ఇదే క్రమంలో జిల్లాలో పోషకలేమితో బాధపడుతున్న వారు వేలల్లోనే ఉన్నారు.

### కారణాలు...

- ☛ రాయితీల కోసం అదనంగా కొనుగోలు చేసి పాడయ్యాక పారేయడం.
- ☛ అవసరం లేకున్నా కొనుగోలు చేయడం
- ☛ విందుల్లో వద్దన్నా వడ్డించడం
- ☛ శుభకార్యాల్లో ఆహ్వానితుల కంటే అదనంగా వండటం, ఎక్కువ రకాలు సిద్ధం చేయించడం

### నియంత్రణ ఇలా..

- ☛ మనం నివసించే ప్రాంతంలో ఫుడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలి.
- ☛ తప్పనిసరిగా వృథా చేయాల్సి వస్తే సేంద్రియ ఎరువు తయారీకి వాడాలి.
- ☛ మెరుగైన నిల్వ పద్ధతులు అనుసరించాలి.



# కంకరపై వెళ్లేదెలా..?



రహదారులు బాగుంటేనే ప్రయాణం సాఫీగా సాగుతుంది. అలాంటిది రోడ్లు గుంతలు పడి, అధ్వానంగా ఉంటే రాకపోకలకు అంతరాయం కలుగుతుంది. జిల్లా కేంద్రంలోని సిరిసిల్లరోడ్డు సమీపంలోని ఎన్‌హెచ్-44 రహదారి నుంచి క్యాసంపల్లి వైపు వెళ్లే దారి అధ్వానంగా మారింది. కంకర తేలడంతో వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, కామారెడ్డి పట్టణం

# ఉమ్మడి జిల్లా చదరంగం పోటీలు

**కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** ఉమ్మడి జిల్లా చదరంగం పోటీలను ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్నట్లు కామారెడ్డి ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 17 స్థాయిలో బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. క్రీడాకారులు దేవునిపల్లి ఉన్నత పాఠశాలకు బోనఫైడ్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు.

### 17న టేబుల్ టెన్నిస్..

**కామారెడ్డి క్రీడావిభాగం:** ఉమ్మడి జిల్లా టేబుల్ టెన్నిస్ పోటీలను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎస్జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్ మంగళవారం ప్రకటనలో తెలిపారు. అండర్- 14, 17 విభాగాల్లో బాలబాలికలకు కామారెడ్డి సీనియర్ సిటిజెన్ కార్యాలయంలో ఎంపికలు ఉంటాయన్నారు.

# 'మూడేళ్లుగా ఉపకార వేతనాలు రాలేదు'



రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ ప్రతినిధులు

**తెవివి క్యాంపస్, న్యూస్‌టుడే:** గత మూడేళ్లుగా ఉపకార వేతనాలు రావడం లేదని, ఈ కారణంతోనే డిగ్రీ, పీజీ ప్రైవేటు కళాశాలలను రెండు రోజులుగా బంద్ పాటించామని తెలంగాణ విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి, అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ఆచార్య చంద్రశేఖర్‌కు మంగళవారం ప్రైవేటు కళాశాలల అసోసియేషన్ ఆధ్వర్యంలో వినతిపత్రం ఇచ్చారు. ఉపకార వేతనాల డబ్బులు రాకపోవడంతో ఉద్యోగులకు కొన్ని నెలలుగా జీతభత్యాలు ఇవ్వలేకపోతున్నామని, తమ ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియజేయాలని విన్నవించారు. అసోసియేషన్ అధ్యక్షుడు హరిప్రసాద్, సమన్వయకర్త నరాల సుధాకర్, ప్రతినిధులు నిశిత రాజు, సూర్యప్రకాష్, సుజన్, అరుణ్‌కుమార్, రాజు తదితరులున్నారు.

# జాతీయ స్థాయిలో 163వ ర్యాంకు



వెంకటేశ్

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** తెవివి దక్షిణ ప్రాంగణం రసాయన శాస్త్రం విభాగానికి చెందిన విద్యార్థి ఇస్లావత్ వెంకటేశ్ జాతీయ స్థాయిలో నిర్వహించిన సీఎస్ఐఆర్ పోటీ పరీక్షలో 163వ ర్యాంకు సాధించాడు. మంగళవారం విడుదల చేసిన ఫలితాల్లో 2022-24 బ్యాచ్‌కు చెందిన వెంకటేశ్ అత్యుత్తమ ప్రదర్శన కనబర్చి విద్యార్థులకు ఆదర్శంగా నిలిచాడని ఆ విభాగం అధిపతి డా.నాగరాజు తెలిపారు. ప్రిన్సిపల్ డా.సుధాకర్, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

# అగ్నిమాపకశాఖ సిబ్బందికి నైపుణ్య శిక్షణ

**కరీంనగర్ నేరవార్తలు, న్యూస్‌టుడే** : కరీంనగర్ మానేరు జలాశయంలో రెండు రోజులపాటు నిర్వహించే అగ్నిమాపక శాఖ జోనల్ స్థాయి నైపుణ్య శిక్షణ మంగళవారం ప్రారంభమైంది. మొదటి రోజు కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిజామాబాద్, కామారెడ్డి, హనుమకొండ, వరంగల్ జిల్లాల నుంచి హాజరైన 70 మంది సిబ్బందికి శిక్షణ అందించారు. కొత్తగా కొనుగోలు చేసిన రిమోట్ కంట్రోల్ లైఫ్ సేవింగ్ బోట్‌పై శిక్షణ, అత్యవసర సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. శిక్షణ కార్యక్రమాన్ని కరీంనగర్ జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, మంచిర్యాల జిల్లా అధికారి భగవాన్‌రెడ్డి పర్యవేక్షించారు.

# జాతీయ స్థాయి సదస్సుకు ప్రధానోపాధ్యాయుడు



శ్రీనాథ్

**భిక్కనూరు** దిల్లీలో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు 'నిరంతర వృత్తిపర అభివృద్ధి' అనే అంశంపై జరిగే జాతీయ సమావేశానికి రాష్ట్రం నుంచి భిక్కనూరు జడ్పీ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనాథ్ ఎంపికయ్యారు. తెలంగాణ నుంచి శ్రీనాథ్‌ను ఎంపిక చేస్తూ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. జాతీయ విద్యావిధానం 2020, ప్రపంచ స్థాయి విద్యా విధానంలో విధానపరమైన సంస్కరణలకు అనుగుణంగా ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు వారి నైపుణ్యాలను పెంపొందించుకునేలా ఈ సదస్సు నిర్వహించనున్నట్లు శ్రీనాథ్ తెలిపారు.

# గడువు పొడిగింపు

**నిజామాబాద్ విద్యావిభాగం, న్యూస్‌టుడే:** డా.బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక వర్సిటీలో డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 30 వరకు గడువు పొడిగించినట్లు గిరిరాజ్ ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ రామ్మోహన్‌రెడ్డి, ప్రాంతీయ అధ్యయన కేంద్ర సమన్వయకర్త రంజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు 7382929612 నంబరులో సంప్రదించాలని సూచించారు

# పేరుకే కమిటీలు

● పుర అభివృద్ధిలో వాటి పాత్ర నామమాత్రం

న్యూస్‌టుడే,కామారెడ్డి పట్టణం



| | |
|---|---|
| జిల్లాలో పురపాలికలు: | 3 |
| వార్డులు | 80 |
| ఎంపిక చేసిన కమిటీలు | 432 |
| సభ్యులు | 5890 |

గత ప్రభుత్వ హయాంలో పురాల్లో వార్డుల్లో కమిటీలను ఏర్పాటు చేసినా ఏ ఒక్కనాడైనా సమావేశాలు నిర్వహించింది లేదు. కాంగ్రెస్ సర్కారు ఏర్పడి ఏడాదికి సమీపిస్తోంది. పట్టణాల ప్రగతిలో ఎంపిక చేసిన అభివృద్ధి కమిటీలు నాలుగున్నరేళ్లలో నామమాత్రమయ్యాయి. వచ్చే జనవరి 25వ తేదీతో పాలకవర్గం గడువు ముగియనుంది. ఆయా విషయాల్లో పాలకవర్గాల జోక్యంతో కమిటీ సభ్యుల మాటలను పట్టించుకునేవారే లేరు. కమిటీ సభ్యులతో సమన్వయం చేయాల్సిన యంత్రాంగం నిర్లక్ష్యం వహిస్తోంది.

### కానరాని చర్యలు

జిల్లాలో ఆయా పురపాలికల పరిధిలో నియమించబడ్డ సభ్యులు తమ పరిధిలోని సమస్యలను గుర్తించి పాలకవర్గం, అధికార యంత్రాంగం దృష్టికి తీసుకురావాలి. ప్రగతి పనుల విషయంలో తగిన సూచనలు అందించాలి. కాని ఇవేమీ అమలు కావడం లేదు. వార్డు ప్రత్యేకాధికారుల జాడే లేదు. కౌన్సిలర్, సభ్యులు వార్డుల్లో పర్యటించి పారిశుద్ధ్యం, వీధిదీపాలు, తాగునీటి వసతి తదితర సమస్యలను పరిశీలించాలి. ప్రగతి పనుల నాణ్యత కూడా పరిశీలించేందుకు అవకాశం కల్పించినా చర్యలు కరవయ్యాయి.

### ప్రణాళిక అమలులో

జిల్లాలో ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పట్టణాల్లో సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. శివారు కాలనీల్లో ప్రగతి చర్యలు కరవయ్యాయి. నాలాల ఆక్రమణలు, నిబంధనలను అతిక్రమించి నిర్మాణాలు చేపడుతున్నారు. పాలిథిన్ నిషేధంపై చైతన్య కార్యక్రమాలు కరవయ్యాయి. బృహత్ ప్రణాళిక అమలు పట్టడం లేదు. వార్డుల సమగ్రాభివృద్ధికి చర్యలు లేవు. ఈ విషయంలో పాలకవర్గ ప్రతినిధులు చెప్పిందే మాటగా అధికారులు వ్యవహరిస్తున్నారు. ఎక్కడ పనులు చేపట్టాలని సూచిస్తే అక్కడే ప్రగతి చర్యలు కనిపిస్తున్నాయి. ఇప్పటివరకైతే సలహా కమిటీల సమావేశాలను జరపలేదని కామారెడ్డి కమిషనర్ సుజాత అన్నారు. ఎవరైనా విలువైన సలహాలు ఇస్తే పుర అభివృద్ధికి పాటుపడుతామన్నారు.

# అన్నదానానికి రూ.లక్ష విరాళం



గ్రామస్థులకు నగదు అందిస్తున్న పారిశ్రామికవేత్త పైడి ఎల్లారెడ్డి

**గాంధారి, న్యూస్‌టుడే:** మేడిపల్లిలో నూతనంగా నిర్మించిన రామాలయ ప్రతిష్ఠాపనోత్సవాల సందర్భంగా నిర్వహించే అన్నదానానికి పారిశ్రామికవేత్త పైడి ఎల్లారెడ్డి రూ.లక్ష విరాళం అందించారు. ఈ మేరకు నగదును మంగళవారం హైదరాబాద్‌లో ఆయన గ్రామస్థులకు అందించారు. నాయకులు నారాయణ, నెహ్రూ, జవార్‌సింగ్ తదితరులు ఉన్నారు.

# మబ్బుల భయం.. వ్యాపారుల పరం



జిల్లాలో వరి నూర్పిళ్లు జోరుగా సాగుతున్నాయి. దసరా తర్వాత ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు తెరుస్తామని అధికారులు ప్రకటించినా ఎక్కడా ప్రారంభం కాలేదు. ఒకవైపు వర్షాల భయం రైతులను వెంటాడుతోంది. ఈ పరిస్థితుల్లో రైతులు ప్రైవేటులో అమ్ముకోవడానికి మొగ్గు చూపుతున్నారు. మద్దతు ధర రాదని తెలిసినా ఆకాశం మేఘావృతం అవుతుండటంతో వారు కలవరపడుతున్నారు. ఇదే అవకాశంగా మల్చుకొని వ్యాపారులు నేరుగా రైతుల కల్లాల వద్దకే వెళ్లి పచ్చిమీదే వడ్లు కొంటున్నారు. క్వింటాకు రూ.2090 -2200 చెల్లిస్తున్నారు. తరుగు కింద క్వింటాకు ఐదు కిలలో కోత పెడుతున్నారని, రూ.300 వరకు నష్టపోతున్నా తప్పట్లేదని వాపోతున్నారు. మాక్లూర్ మండలం గొట్టిముక్కుల శివారులో రోడ్డు పక్కన లారీలోకి ధాన్యం ఎక్కిస్తుండగా తీసిన చిత్రమిది.

- ఈనాడు, నిజామాబాద్



క్రీడాకారిణులు రాణి, మమత, ఇందూ

# జాతీయ జట్టులో జిల్లా క్రీడాకారిణులు

**నిజామాబాద్ క్రీడావిభాగం:** మహారాష్ట్రలో జరిగిన జాతీయ సాఫ్ట్‌బాల్ శిక్షణ శిబిరంలో ఉత్తమ ప్రతిభ చాటిన జిల్లా క్రీడాకారిణులు గుగులోత్ మమత, అజ్మీర ఇందు, లకావత్ రాణిలు తైవాన్ దేశంలోని తైచుంగ్ నగరంలో జరుగుతున్న నాలుగో ఏసియన్ యూనివర్సిటీ మహిళా సాఫ్ట్‌బాల్ ఏసియా కప్-2024లో భారత జట్టు తరఫున ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంగళవారం నుంచి ఈ నెల 19 వరకు జరిగే పోటీల్లో వీరు పాల్గొననున్నారు. జిల్లా క్రీడాకారిణులు పోటీల్లో రాణించి విజయంతో తిరిగి రావాలని జిల్లా సాఫ్ట్‌బాల్ సంఘం అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ప్రభాకర్ రెడ్డి, గంగామోహన్ ఆకాంక్షించారు.

### సాఫ్ట్‌బాల్ టోర్నీకి ఎంపిక

**డిచ్‌పల్లి, న్యూస్‌టుడే:** ఈ నెల 18 నుంచి 20 వరకు వరంగల్ జిల్లాలో రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ టోర్నీ జరగనుంది. దీనికి జిల్లా బాలికల ప్రబుబుల్స్ జట్టును సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల మైదానంలో మంగళవారం ఎంపిక చేసినట్లు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, గంగామోహన్ తెలిపారు. పాఠశాల ప్రిన్సిపల్ నళిని, వైస్ ప్రిన్సిపాళ్లు స్వప్న, వనిత, అకాడమీ కోచ్‌లు మౌనిక, నరేశ్, పీఈటీ శ్రీలత పాల్గొన్నారు.

# అంతర్జాతీయ ఉషూ పోటీలకు జిల్లా విద్యార్థిని

**నిజామాబాద్ విద్యావిభాగం:** తమ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థిని ఆకాంక్ష ఈ నెల 17-27 తేదీల్లో జార్జియా దేశం బటోమి పట్టణంలో నిర్వహించనున్న అంతర్జాతీయ ఉషూ మార్షల్ ఆర్ట్స్ టోర్నీలో పాల్గొననుందని విజయ్ ఉన్నత పాఠశాల కార్యదర్శి అమృతలత మంగళవారం తెలిపారు. క్రీడాకారిణిని, శిక్షకుడు ఉమెర్‌ను అభినందించారు.

# 17న ఉద్యోగ మేళా

**ఖలీల్‌వాడి, న్యూస్‌టుడే:** నిరుద్యోగులకు ప్రైవేటు రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించడానికి ఈ నెల 17న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధికల్పన అధికారి మధుసూదన్‌రావు పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు గురువారం ఉదయం 10.30 గంటలకు శివాజీనగర్‌లోని ఉపాధికల్పన కార్యాలయంలో నిర్వహించే ఉద్యోగ మేళాకు హాజరుకావాలని తెలిపారు. బయోడేటా, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, ఫొటో వెంట తెచ్చుకోవాలని సూచించారు.

# ట్యాంకుపై ఎక్కి ఆత్మహత్యాయత్నం

**రామారెడ్డి:** వ్యక్తిగత కారణాలతో ఓ యువకుడు ట్యాంకుపైకి ఎక్కి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన రామారెడ్డి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. రామారెడ్డి గ్రామానికి చెందిన కట్ట బాబు(28) వ్యక్తిగత కారణాలతో ఇబ్బంది పడుతున్నాడు. ఆత్మహత్య చేసుకునేందుకు మంగళవారం ట్యాంకుపైకి ఎక్కాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలికి చేరుకుని యువకుడిని కాపాడినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.



నీటి శుద్ధిపై మంచినీటి సహాయకులకు అవగాహన కల్పిస్తున్న శిక్షకుడు

# పరిశుభ్రమైన తాగునీరందించాలి

**జక్రాన్‌పల్లి, న్యూస్‌టుడే:** మిషన్ భగీరథ ద్వారా ప్రజలకు పరిశుభ్రమైన తాగునీటిని అందించాలని డీఈ గంగారాం సూచించారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్ గ్రామంలోని మిషన్ భగీరథ నీటి శుద్ధి ప్లాంట్‌లో మంగళవారం ఆర్మూర్ మండల గ్రామ మంచినీటి సహాయకులకు శిక్షణ తరగతులు నిర్వహించి మాట్లాడారు. లీకేజీలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్మూర్ ఎంపీడీవో సాయిరాం, ఏఈలు మోహన్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వేడుకగా వేంకటేశ్వర కల్యాణం

**డిచ్‌పల్లి, న్యూస్‌టుడే**: డిచ్‌పల్లి ఏడో బెటాలియన్‌లో లక్ష్మీవేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగుతున్నాయి. పండితులు మంగళవారం అలివేలు మంగ సమేత లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం జరిపారు. ఉదయం ఆరాధన, నిత్యహోమం, బలిహరణం, సాయంత్రం నిత్యహవనము, హోమ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం ఏర్పాటు చేశారు. బెటాలియన్ అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.



స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

# తవ్వారు.. వదిలేశారు



దోమకొండ మండలం ముత్యంపేటలో సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. గతంలో మిషన్ భగీరథ పైపులైన్ కోసం సీసీ రోడ్డును తవ్వేశారు. సదరు గుత్తేదారు పైపులైన్ వేసి మట్టిని చదును చేయించి వదిలేశారు. సీసీ తవ్విన ప్రాంతంలో గుంతలుగా మిగిలాయి. రోడ్డుపై రాకపోకలు సాగించడానికి వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని బురుజు, పాత మసీదు, 12 వార్డు ప్రాంతాల్లో సీసీ రోడ్డు అధ్వానంగా మారింది. నాలుగేళ్లు గడుస్తున్నా దారిని బాగు చేయకపోవడంతో స్థానికులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గతంలో మిషన్ భగీరథ పైపులైన్ వేసిన సమయంలోనే సదరు గుత్తేదారు సీసీ చేయాల్సి ఉంది. మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్ అధికారులు సమన్వయంతో చొరవ చూపితేనే మరమ్మతులు లేదా కొత్త సీసీ నిర్మాణం జరుగనుంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వరప్రసాద్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. తాను కొత్తగా వచ్చానని, పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు.

- న్యూస్‌టుడే, దోమకొండ

## మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
బాన్సువాడ 83284 29129
కామారెడ్డి 93970 82242



జిల్లా కేంద్రంలోని విద్యానగర్‌లో ఖాళీస్థలాల్లో పిచ్చిమొక్కలు పెరిగి పారిశుద్ధ్య సమస్య నెలకొనడంపై స్థానికుడు రఘు ఈనాడుకు వివరించగా శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్ స్పందించి సమస్య పరిష్కరింపజేశారు.

రంగంపేటలో నీటితొట్టె పాకురుతో అపరిశుభ్రంగా ఉండటంపై స్థానికులు మేమున్నాం మీకు తోడుగా దృష్టికి తేగా కార్యదర్శి ప్రశాంత్ స్పందించి సిబ్బందితో శుభ్రం చేయించారు.



**సమస్య:** వాసవి కాలనీలో పలు చోట్ల రోడ్లు చెత్తమయంగా మారాయి. - ప్రమోద్, స్థానికుడు



**పరిష్కారం:** పర్యావరణ ఇంజినీర్ హన్మాండ్లు దృష్టికి తీసుకెళ్లగా ఆయన సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేయించి సమస్య పరిష్కరింపజేశారు.

జిల్లా కేంద్రంలోని సైలన్‌బాబాకాలనీలో పట్టపగలే వీధి దీపం వెలుగుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. **- కిరణ్, సైలన్‌బాబాకాలనీ**

పగటిపూట దీపం వెలగకుండా సిబ్బందికి సూచన చేస్తాం. **- సుజాత, కమిషనర్**

పిట్లం మండల కేంద్రంలోని నేతాజీ నగర్‌కాలనీలో కుళాయి ట్యాంకు చుట్టూ పాకురు పేరుకుపోయింది. **-హన్మాండ్లు, స్థానికుడు**

ట్యాంకును పరిశీలించి సిబ్బందితో పాకురు తొలగింపజేస్తాం. **- యాదగిరి, కార్యదర్శి, పిట్లం**

పోచమ్మ వీధిలో దీపాలు వెలగడం లేదు. **- లింగం, చింతామాన్‌పల్లి, దోమకొండ మండలం**

పరిశీలించి దీపాలు బిగిస్తాం. **- రమేశ్, కార్యదర్శి, చింతామాన్‌పల్లి**

–న్యూస్‌టుడే, రామారెడ్డి, దోమకొండ, బాన్సువాడ పట్టణం కామారెడ్డి పట్టణం, పిట్లం

## కల్కి చెరువు సుందరీకరణకు చర్యలు

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కల్కి చెరువు సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు పురపాలక ఛైర్మన్ జంగం గంగాధర్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన చెరువును పరిశీలించారు. వ్యర్థాలు, గుర్రపు డెక్కను తొలగించనున్నట్లు తెలిపారు. ఎటువంటి వ్యర్థాలు వేయొద్దని ప్రజలకు సూచించారు. చెరువులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిదన్నారు.

## ఆలయానికి విరాళం

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కోటగల్లీకి చెందిన విఠాభాయి మంగళవారం కోట దుర్గా భవాని ఆలయానికి రూ.10 వేలను ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సభ్యులు ఆమెను సత్కరించారు. కార్యక్రమంలో ప్రతినిధులు శ్రీకాంత్, లింగం తదితరులున్నారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలి

**లింగంపేట, న్యూస్‌టుడే:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలని ప్రత్యేక అధికారి సురేందర్ సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.


## సిబ్బందికి అవగాహన

**గాంధారి, న్యూస్‌టుడే:** ప్రతి గ్రామంలో సరైన నీటి వసతులు కల్పించాలని డీఎల్‌పీవో సురేందర్ ఎంపీడీవో రాజేశ్వర్ అన్నారు. మంగళవారం నీటి సరఫరా సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించారు.

## పొంచి ఉన్న ప్రమాదం

బిచ్కుంద నుంచి చిన్నదడ్గికి వెళ్లే దారిలో వంతెన వద్ద బావి పొదల చాటున ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. మరో వైపు దారి వెంట మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. వంతెనపై రక్షణ దిమ్మెలు కూడా లేవు.

–బిచ్కుంద గ్రామీణం, న్యూస్‌టుడే



# కష్టాలు దాటి.. కలలు నెరవేర్చుకుని

కష్టపడి చదివి అనుకున్నది సాధించారు. తల్లిదండ్రుల మోముల్లో చిరునవ్వులు నింపారు. తరగతి గదుల్లో విద్యార్థులకు విజ్ఞానం బోధించి వారిని ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యతను నిర్వర్తించనున్నారు. బుధవారం నుంచి పాఠశాలలకు అడుగుపెట్టబోతున్న పలువురు నూతన ఉపాధ్యాయుల మనోగతం తెలుసుకుందాం.
- న్యూస్‌టుడే, కామారెడ్డి విద్యావిభాగం, కలెక్టరేట్

### తెలుగమ్మాయి ఉర్దూ టీచర్‌గా



- జయశ్రీ, స్కూల్ అసిస్టెంట్

ఒకటి నుంచి నాలుగో తరగతి వరకు బిచ్కుంద మండల కేంద్రంలో ఉర్దూ మాధ్యమంలో చదువుకున్నా. ఐదు నుంచి పది వరకు బాన్సువాడలో విద్యనభ్యసించా. గతేడాది టెట్ రాశా. డీఎస్సీ- 2024 ద్వారా స్కూల్‌అసిస్టెంట్ (ఉర్దూ) ఉద్యోగం దక్కడం ఆనందంగా ఉంది.

### పట్టుదలతో ప్రథమ ర్యాంకు



- నరేశ్, ఎస్‌ఏ తెలుగు

ప్రాథమిక స్థాయి నుంచి తెలుగుపై పట్టు సాధించా. ఈ ఏడాది నిర్వహించిన డీఎస్సీలో స్కూల్‌అసిస్టెంట్ తెలుగులో జిల్లా స్థాయిలో ప్రథమ ర్యాంకు దక్కింది. ప్రస్తుతం బిచ్కుంద ప్రభుత్వ బడిలో ఉద్యోగం చేయడానికి అధికారులు ఉత్తర్వు ప్రతి ఇచ్చారు.

### పేదరికం అధిగమించి



- రాజ్‌కుమార్, ఎస్‌ఏ భౌతికశాస్త్రం

అమ్మ నాగమణి బీడీలు చుడుతుంది. నాన్న చేనేత పని చేస్తారు. చిన్ననాటి నుంచి కుటుంబ పరిస్థితులు అంతంతమాత్రంగానే ఉన్నాయి. కష్టపడి చదివి జిల్లా స్థాయిలో ఎస్‌ఏ- భౌతికశాస్త్రంలో జిల్లాస్థాయిలో రెండో ర్యాంకు సాధించా.

### ఇబ్బందులకు ఎదురీది



మా స్వస్థలం ఎల్లారెడ్డి. అమ్మ దుస్తులు కుడుతుంది. నాన్న ఆటో డ్రైవర్. జీవిత డీఎస్సీ పరీక్షల్లో గణితంలో జిల్లాస్థాయి మొదటి ర్యాంకు సాధించడం ఆనందంగా ఉంది. జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నా. బుధవారం నుంచి సర్కారు బడికి ఉపాధ్యాయుడిగా వెళ్లడం నాలో ఆత్మస్థైర్యాన్ని నింపింది. - గిరి, ఎస్‌ఏ గణితం

## కార్యకర్తలు తరలిరావాలని పిలుపు

**కామారెడ్డి సంక్షేమం, న్యూస్‌టుడే:** జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా మద్ది చంద్రకాంత్‌రెడ్డి బాధ్యతల స్వీకరణ సందర్భంగా ఈ నెల 20వ తేదీన నిర్వహించే సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు పిలుపునిచ్చారు. పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సత్యాగార్డెన్‌లో నిర్వహించే సమావేశానికి ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యేలు హాజరుకానున్నట్లు చెప్పారు. మున్సిపల్ ఛైర్ పర్సన్ గడ్డం ఇందుప్రియ, పట్టణ అధ్యక్షుడు పండ్ల రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కైలాస్ శ్రీనివాస్‌రావు

## అదనపు కలెక్టర్‌ను కలిసిన చంద్రకాంత్‌రెడ్డి

**కామారెడ్డి కలెక్టరేట్, న్యూస్‌టుడే:** అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, డీపీవో శ్రీనివాస్‌రావును జిల్లా గ్రంథాలయ సంస్థ ఛైర్మన్‌గా నియామకమైన మద్ది చంద్రకాంత్‌రెడ్డి మంగళవారం మర్యాద పూర్వకంగా కలిశారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావు, నాయకులు రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.





భిక్కనూరు: రామేశ్వర్‌పల్లిలో



రామారెడ్డిలో..

## దార్శనికుడు అబ్దుల్‌కలాం

అబ్దుల్ కలాం గొప్ప దార్శనికుడని పలువురు వక్తలు పేర్కొన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం ఆయన జయంతి నిర్వహించారు. భిక్కనూరు, రామారెడ్డి, సదాశివనగర్, గాంధారి, మాచారెడ్డి తదితర ప్రాంతాల్లో నివాళులర్పించారు.

న్యూస్‌టుడే, బృందం



మాచారెడ్డి: ఘన్‌పూర్ జడ్పీపాఠశాలలో..



గాంధారి జడ్పీహెచ్‌ఎస్‌లో..

## అన్నదాతల నిరసన



బీర్కూర్‌లో ఆరబెట్టిన ధాన్యం వద్ద రైతులు

**బీర్కూర్, న్యూస్‌టుడే:** వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని మంగళవారం బీర్కూర్‌లో రైతులు నిరసన తెలిపారు. రైతులు మాట్లాడుతూ.. వారం కిందట పంట కోసి ఆరబెట్టిన ధాన్యం వర్షానికి తడుస్తోందని వాపోయారు. రోజుల కొద్దీ ధాన్యాన్ని ఆరబెట్టడంతో ఎండకు తరుగుపోతుందని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

## కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తూకం వేస్తున్న కాసుల బాల్‌రాజ్

**బీర్కూర్:** ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని రాష్ట్ర ఆగ్రోస్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ కాసుల బాల్‌రాజ్ పేర్కొన్నారు. తిమ్మాపూర్‌లో మంగళవారం మైలారం సొసైటీ పరిధిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యం రూ.2320, బీ గ్రేడ్ ధాన్యం రూ.2300 చొప్పున కనీస మద్దతు ధర రైతులకు ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. సొసైటీ ఛైర్మన్ దేవళ్ల హన్మంతురావు, నాయకులు నరేందర్, రాజు, రవి తదితరులు ఉన్నారు.

**నస్రుల్లాబాద్:** నాచుపల్లిలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సొసైటీ వైస్ ఛైర్మన్ గంగారాం ప్రారంభించారు.



గండివేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

**గాంధారి, న్యూస్‌టుడే:** రైతులకు ఇబ్బందులు లేకుండా ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి ఎల్‌ఆర్‌ఎస్, వరి కొనుగోలు కేంద్రాలు, తదితర విషయాలపై మంగళవారం తహసీల్దార్ సతీష్‌రెడ్డి, సిబ్బందితో సమీక్షించారు. అనంతరం గండివేట్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. డీసీఎస్‌వో నరసింహారావు, డీఎం(సీఎస్) రాజేందర్, ఎంపీడీవో రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

**పిట్లం, న్యూస్‌టుడే:** ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఈ నెల 16వ తేదీ నుంచి ప్రారంభించాలని అదనపు డీఆర్‌డీవో వామన్‌రావు అన్నారు. పిట్లం మండల కేంద్రంలో మంగళవారం వ్యవసాయశాఖ, ఐకేపీ అధికారులు, ఏఎంసీ, సొసైటీ కార్యదర్శులు, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ వేణుగోపాల్, ఆర్ఐ శీతల్, ఎంపీడీవో కమలాకర్, ఏవో కమల తదితరులు పాల్గొన్నారు.

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** భిక్కనూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని విండో అధ్యక్షుడు గంగళ్ల భూమయ్య ప్రారంభించారు. జిల్లా గ్రంథాలయ ఛైర్మన్ మద్ది చంద్రకాంత్‌రెడ్డి, టీపీసీసీ కార్యదర్శి బద్దం ఇంద్రకరణ్‌రెడ్డి, భిక్కనూరు ఏఎంసీ ఛైర్మన్ పాత రాజు, ఏడీఏ అపర్ణ, ఏవో రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**మాచారెడ్డి, న్యూస్‌టుడే:** మాచారెడ్డి మండల కేంద్రంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. సొసైటీ ఛైర్మన్ పూల్‌చంద్, మాచారెడ్డి రైతు కన్వీనర్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

## మధ్యాహ్న భోజన కొత్త ఏజెన్సీ నియామకం



కమిటీతో మాట్లాడుతున్న ఎంఈవో అశోక్, హెచ్‌ఎం రవీంద్రారెడ్డి

**బీబీపేట:** బీబీపేట టీఎస్‌ఎన్‌ఆర్ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం పాత ఏజెన్సీని తొలగించి, డీఈవో ఆదేశాల మేరకు కొత్త ఏజెన్సీని మంగళవారం నియమించినట్లు ఎంఈవో అశోక్ తెలిపారు. భోజనం నాణ్యతపై గతంలో ఫిర్యాదులు రాగా.. సెప్టెంబరు 21న చేసిన తీర్మానం మేరకు చర్యలు తీసుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం రవీంద్రారెడ్డి అన్నారు. పాత ఏజెన్సీ వారు పాఠశాలకు చేరుకొని 15 ఏళ్లుగా వంట చేస్తున్నామని.. మరో అవకాశం కల్పించాలని హెచ్‌ఎం, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీని కోరారు. పోలీసుల బందోబస్తుతో కొత్త ఏజెన్సీ వారు వంట చేసి విద్యార్థులకు వడ్డించారు.

## సమ్మేళన సభ ప్రతుల ఆవిష్కరణ

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** ధర్మసమాజ్ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన కార్యకర్తల మహాసమ్మేళన ప్రతులను జిల్లాకేంద్రంలో ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. రాష్ట్ర కమిటీ సభ్యుడు లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ బోలేశ్వర్ మాట్లాడుతూ.. అగ్రవర్ణ భూస్వామ్య రాజకీయ వ్యవస్థపై పోరాటాలకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో జరగబోయే కార్యకర్తల సమ్మేళనంలో భవిష్యత్ కార్యాచరణ ప్రకటిస్తామన్నారు. కార్యక్రమంలో ప్రతినిధులు గంగరాజు, రాజశేఖర్, లక్ష్మణ్, శివరామకృష్ణ, నితిన్, లింగం, సత్యం పాల్గొన్నారు.





కామారెడ్డిలో ప్రతులు ప్రదర్శిస్తున్న ప్రతినిధులు


## భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పారాయణం



పారాయణంలో పాల్గొన్న మహిళలు

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** జిల్లాకేంద్రంలోని సిరిసిల్లరోడ్డులో వాసవీమాత ఆలయంలో మహిళలు మంగళవారం సామూహిక పారాయణం చేశారు. భక్తిశ్రద్ధలతో పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని కొలిచారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేపట్టారు.

## మనస్తాపంతో వృద్ధుడి ఆత్మహత్య



రాములు

**మహ్మద్‌నగర్:** ఆరోగ్యం బాగాలేక జీవితంపై విరక్తి చెంది వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మహ్మద్‌నగర్ మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఏఎస్సై రాజేశ్వర్ కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చింతల చిన్న రాములు(65) కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. మంగళవారం తీవ్ర మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుమారుడు కాశీరాం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### అనారోగ్యంతో..

**ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే:** తరుచు అనారోగ్యం బారిన పడుతూ.. చికిత్స తీసుకున్నా నయం కాకపోవడంతో అప్పులు పెరిగి వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్లారెడ్డి మండలం మల్లాయిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...గడ్డం భూమయ్య(45) మంగళవారం ఉదయం బయటకు వెళ్తున్నానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. ఊరు చివరలోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గ్రామస్థులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. భార్య పద్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

### వివాహిత..

**రామారెడ్డి, న్యూస్‌టుడే:** అనారోగ్యంతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన రామారెడ్డి మండలం ఇస్సన్నపల్లిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్సై నరేష్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన కొంపల్లి మల్లవ్వ(22) ప్రసవం అయిన నుంచి అనారోగ్యంతో బాధపడుతుంది. ఆసుపత్రుల చుట్టూ తిరిగినా నయం కాలేదు. జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబీకుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

### బావిలో పడి ఒకరి మృతి

**సదాశివనగర్, న్యూస్‌టుడే:** దాహం వేయడంతో నీళ్లు తాగేందుకు వెళ్లి బావిలో పడి ఒకరు మృతిచెందిన ఘటన సదాశివనగర్ మండలం లింగంపల్లిలో చోటుచేసుకుంది. ఎస్సై రంజిత్ తెలిపిన వివరాల ప్రకారం...గణేష్(36) సోమవారం రాత్రి వ్యవసాయ భూమి పక్కనే ఉన్న బావి వద్దకు నీళ్లు తాగేందుకు వెళ్లారు. ప్రమాదవశాత్తు కాలుజారి అందులో పడిపోయాడు. భార్య శ్యామల ఫిర్యాదుతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

## పౌష్టికాహారం అందించాలి

**సదాశివనగర్, న్యూస్‌టుడే:** అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, గర్భిణులకు క్రమం తప్పకుండా పౌష్టికాహారం అందించాలని, నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. సదాశివనగర్ మండలం అడ్లూర్ ఎల్లారెడ్డిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. చిన్నారుల హాజరు శాతం పరిశీలించారు. ఆర్డీవో రంగనాథ్‌రావు, జడ్పీ సీఈవో చందర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, పర్యవేక్షణాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.



## పశువులకు టీకాలు తప్పనిసరి



టీకాలు వేస్తున్న జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్ తదితరులు

**రామారెడ్డి, న్యూస్‌టుడే:** పశువులకు గాలికుంటు టీకాలు తప్పనిసరిగా వేయించాలని జిల్లా పశువైద్యాధికారి శ్రీనివాస్ అన్నారు. రామారెడ్డిలో పశువులకు మంగళవారం టీకాలు వేశారు. గ్రామంలోని 228 జీవాలకు టీకాలు వేశామని చెప్పారు. సహాయ సంచాలకులు శ్రీనివాస్‌రావు, జేడీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

**కామారెడ్డి పట్టణం, న్యూస్‌టుడే:** సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం ఇస్తున్నట్లు పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ అన్నారు. కామారెడ్డిలోని 33వ వార్డులో మంగళవారం ఆమె పర్యటించారు. చెత్త తొలగించకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మురుగు కాల్వలు పూడిక సకాలంలో తీయాలన్నారు. సామాజిక పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టాలన్నారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పర్వేజ్, సిబ్బంది రాజేందర్ తదితరులున్నారు.



చెత్తను తొలగించాలని సిబ్బందికి సూచిస్తున్న పుర ఛైర్‌పర్సన్ ఇందుప్రియ

## 18న వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు

**కామారెడ్డి క్రీడావిభాగం, న్యూస్‌టుడే:** కామారెడ్డి జోన్ స్థాయి వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలను ఈ నెల 18వ తేదీన చిన్నమల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసినట్లు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి హీరాలాల్, పీడీ దయాకర్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 బాలబాలికలకు వేర్వేరుగా నిర్వహించే పోటీలకు పాఠశాలకు ఒక జట్టును(ఆరుగురు) ఆడిస్తామని పేర్కొన్నారు.

## ఉద్యోగులకు సన్మానం

**దోమకొండ, న్యూస్‌టుడే:** బదిలీపై వెళ్తున్న దోమకొండ ఏడీఈ కిరణ్‌చైతన్య, ఏఈ ప్రదీప్‌కుమార్‌తో పాటు పలువురు ఉద్యోగ సిబ్బందిని మంగళవారం సన్మానించారు. దోమకొండ ఏడీఈ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యుడు తిర్మల్‌గౌడ్ వారిని సన్మానించారు. సిబ్బంది దివ్య గాయిత్రి, ఎ.రామలక్ష్మి, జె.మారుతి పాల్గొన్నారు.

## చేతుల్ని శుభ్రంగా ఉంచుకోండి

**ఎల్లారెడ్డి, న్యూస్‌టుడే:** ప్రతి ఒక్కరు భోజన సమయంలో చేతుల్ని శుభ్రం చేసుకోవాలని ఆర్డీవో ప్రభాకర్ అన్నారు. గ్లోబల్ హ్యాండ్ వాషింగ్ డే సందర్భంగా ఎల్లారెడ్డి మండలం అన్నాసాగర్ పరిధిలోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలను మంగళవారం సందర్శించి మాట్లాడారు.



## ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను వేగవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి

**దోమకొండ, న్యూస్‌టుడే:** ఎల్‌ఆర్‌ఎస్ సర్వేను వేగవంతం చేయాలని దోమకొండ మండల ప్రత్యేకాధికారిణి జ్యోతి అన్నారు. మంగళవారం ఎల్‌ఆర్‌ఎస్ సభ్యులతో మండల పరిషత్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. మొదటగా ఆమె దోమకొండలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలకు ఇస్తున్న పౌష్టికాహారం గురించి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మాల్తుమ్మెదలో ఉర్సు

**నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే:** మండలంలోని మాల్తుమ్మెద గ్రామ సమీపంలో దర్గా ఉర్సు సోమవారం రాత్రి నిర్వహించారు. దర్గా పీఠాధిపతి సూఫీషా మొహ్మద్ అబ్దుల్ రహీం షత్తారీ ఉల్ ఖాద్రీ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా ఉత్సవాలు నిర్వహించారు.



## సిమెంట్ బల్లల వితరణ

**భిక్కనూరు, న్యూస్‌టుడే:** భిక్కనూరు బస్టాండ్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం నాలుగు సిమెంట్ బల్లలను ఆర్టీఐ జిల్లా ప్రతినిధి గంగళ్ల రవిందర్ మంగళవారం ఏర్పాటు చేశారు. ప్రయాణ ప్రాంగణంలో తాగునీరు, మూత్రశాలల సౌకర్యాలు కల్పించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని ఆర్టీసీ అధికారులను కోరారు.

## ఉచిత కంటి వైద్య శిబిరం రేపు

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని క్లబ్ భవనంలో గురువారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నేత్ర వైద్యుడు సంపత్ కుమార్ తెలిపారు. కంటి సంబంధిత సమస్యలున్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## బాధ్యతల స్వీకరణ

**నాగిరెడ్డిపేట, న్యూస్‌టుడే:** నాగిరెడ్డిపేట మండల ప్రత్యేకాధికారిగా రత్నం మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమెకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.



## యువతి అదృశ్యం

**మాచారెడ్డి, న్యూస్‌టుడే:** మాచారెడ్డికి చెందిన ఓ యువతి సోమవారం మధ్యాహ్నం కంప్యూటర్ శిక్షణకు కామారెడ్డికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబీకులు ఎంత వెతికినా ఆచూకీ లభించలేదు. యువతి తల్లి మంగళవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

## కర్షక మిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**బీర్కూర్, న్యూస్‌టుడే:** రైతులు కర్షక మిత్ర పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీర్కూర్ ఎన్‌డీసీసీబీ మేనేజర్ రవీందర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని సహకార కేంద్ర బ్యాంకులో మంగళవారం రైతులకు వివిధ రుణాలపై ఆయన అవగాహన కల్పించారు. విద్యార్థులకు విదేశీ విద్యకు రూ.20 లక్షలు, స్వదేశీ విద్యకు రూ.10 లక్షల వరకు రుణాలు మంజూరు చేస్తున్నామని పేర్కొన్నారు.

## వీడ్కోలు సమావేశం

**బీర్కూర్, న్యూస్‌టుడే:** బీర్కూర్ ట్రాన్స్‌కో ఏఈ రాంప్రసాద్ కుమురం భీం జిల్లా కాగజ్‌నగర్‌కు బదిలీ అయ్యారు. ఈ మేరకు మంగళవారం బీర్కూర్ విద్యుత్తు ఉపకేంద్రం ఆవరణలో ఆయన్ను విద్యుత్తు ఉద్యోగులు, సిబ్బంది సత్కరించారు. నాలుగేళ్లు వినియోగదారులకు అందించిన సేవలను పలువురు కొనియాడారు.

## ఆలయంలో సామూహిక పూజలు

**బాన్సువాడ పట్టణం, న్యూస్‌టుడే:** పట్టణంలోని కోట దుర్గ ఆలయంలో మంగళవారం భక్తులు సామూహిక కుంకుమార్చనలు చేశారు. పంచామృతాలతో అమ్మవారిని అభిషేకించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.